

ఇక కావలసినదేమి?

(ప్రేమచందువ్రాత ననుసరించి)

మాడపాటి హనుమంతరావు గారు

౧

గోపాలరావునకు ఆదాయము తక్కువగాను, వ్యయము హెచ్చుగాను ఉండుట సంభవించెను. చిన్నికుమారుని ఎత్తుకొని యాడించుటకొరకు ప్రత్యేకముగా నొకపనికత్తెనుంచుట కష్టముగా గానిపించుచుండెను. అయినను, బాలుని యారోగ్యముయొక్క అవసరములు కొంతవరకును, సరివారిలో పుర్యానగా నుండవలయునను తలంపులు కొంతవరకును, పనికత్తె జీతమును భరింప గోపాలరావును నిర్బంధించుచుండెను. పిల్లవానికి పనికత్తెతో ఎంతో మచ్చిక; నిముసమైనను దానిచంకవదలియుండడు. ఈకారణమువలన దానియక్కర మరింత అనివార్యమయ్యెను. పైకారణములుగాక మరియొకయంశముకూడ నుండెను. మహాలక్ష్మి ఆయింటియందు మూడు సంవత్సరములనుండి పనిచేయుచుండినది. గోపాలరావుయొక్క ఏకపుత్రు నది కడుప్రేమతో పెంచుచు, ఆడించుచుండుటేకాక, గృహసంబంధమగు ఇతరకార్యములను గూడ శ్రద్ధతో నిర్వహించుచుండెను. ఇట్టిదానిని అకారణముగ తొలగించుటకాని, తొలగించుట కేదేని కారణమును కల్పించుటగాని గోపాలరావువంటి సత్స్వభావము కలవానికి దుస్తరముగ దోచుచుండెను. మొగమాట మాతని మానసమును సంపూర్ణముగ నాక్రమించి, మహాలక్ష్మిని పొమ్మనునంతటి ధైర్యమునకు ఏమాత్రము తావొసగజాలనయ్యె.

మహాలక్ష్మియొక్క వర్తనమునుగురించి గోపాలరావున కెంత మంచియభిప్రాయ ముండినను, రుక్మిణమ్మ మాత్రము భర్తతో నేకీభవించునది కాదు. మహాలక్ష్మి యిల్లు గుల్లచేయుచున్నదని యామెతలంపు. బజారునకు పోయి వస్తువులు తెచ్చుచుండునపుడు, రుక్మిణమ్మ తలుపుచాటున పొంచుండి, కూరగాయలనుగాని, పంచదార పప్పు మున్నగు ఏవైన పదార్థములనుగాని అవతల ఎచ్చటనైన దాచుకొనుచున్నదేమో యని తొంగితొంగి చూచును. తెచ్చినసామగ్రులను పదిసారులు శోధించును, తర్కవితర్కములు సల్పును. "ఇంతేనా?" "ఏసరకొప్పున తెచ్చినావు?" "అంతప్రియమైనదా?" యనుప్రశ్నములవర్షము మహాలక్ష్మిపై గురియుచుండును. మహాలక్ష్మి ఈప్రశ్నలకు తరచుగా, మిగులవినయముతో, మృదుశబ్దములలో ప్రత్యుత్తరముచెప్పును. కాని నోరసానిగారికి కొంతకోపోద్రేకము కలిగినట్లు కానవచ్చినప్పుడు మాత్రము, పనికత్తెయు కొంతయావేశమునకు లోనగుచుండెడిది. ఒట్టుపెట్టుకొనును; ప్రమాణముచేయును; ఉత్తగసాక్ష్యము నుల్లేఖించును: ప్రతివాదము సల్పును! ఈవ్యవహారమునందు ఎంతోకాలము గడచుచుండెను! ఇట్టినాటకము ప్రతిదినము ప్రదర్శింపబడుచుండెడిది. అయినను నాటకము సంపూర్ణప్రమోదాంతముగా గాని, సంపూర్ణవిషాదాంతముగా గాని యుండక, మహాలక్ష్మియొక్క దుఃఖాశ్రువులు కొన్ని నేలరాలుటతో సమాప్తమగుచుండెను. అదియే మంగళహారతి! ఇన్నికష్టములు సహించుచు పనికత్తె ఇంకను ఇంటియందే యుండుట రుక్మిణమ్మ అనుమానములకు దోహదము కల్గించుచుండెను. "కేవలము అబ్బాయిమీది అపేక్షవలన నిది యిల్లువదలక పట్టుకొని యున్నదని నేను నమ్మను, తనలాభముకొరకే నిలిచియున్నది!" అని యామె యనుకొనును. మహాలక్ష్మి వంటి కొద్దికులపుమనిషియందు ఉదారమును, లలితమును నగు ప్రేమభావముండుట యసాధ్యమని రుక్మిణమ్మ యూహ!! నిజమేనేమో!!!

౨

ఒకనాడు దైవవశమున మహాలక్ష్మి బజారునుండి కొంచెము ఆలస్యముగా యింటికివచ్చినది. దారిలో ఇద్దరు కూరగాయలమ్ముకొను ఆడువాండ్రు ఎందునకో తీవ్రముగా పోట్లాడుచుండిరి. వారి హస్తాభినయము, వారియుద్రేకపూరితమగు వాదవివాదము, వారిపరస్పర నిందారోపణ, వారొకరిపై నొకరు ప్రయోగించుకొను ఎక్కసక్కెములు, వారిసాక్ష్యము, వారి ప్రతిసాక్ష్యము, వారి పూర్వకక్షల యుల్లేఖనము నిరుపమానములుగా నుండెను. రెండుదావాగ్నులు తీండ్రించి పరస్పరాలింగనము చేయుచుండెనని భావింపుడు! రెండు విషసాగరము లుప్పొంగి సమ్మిళితము లగుచుండెననియైన తలంపుడు!! ఎట్టిప్రశంసనీయమగు వాగ్వేగము! ఎట్టి ప్రభావవంతమగు వక్తృత్వము!! ఇరువురిలో ప్రతియొకతెయు తనభావముల ప్రకటింపవలయునను నుత్సాహాతిరేకమువలన రెండవదానిమాట చెవిజొరనిచ్చుటలేదు. ఆశబ్దములయశ్లీక, ఆభావగాంభీర్యత, ఆయుపమాన పరంపర, ఆతీర్మానములలోని తర్కమును వినినచో, అసూయాగ్రస్తుడుకాని మహాకవి యుండునా? ఆచిలుకగోరువంకలు తమపలుకుల యానందమున నిమగ్నములై యుండెను. చూచువారికి వీరివద్దనున్న వాగ్జాలపుసరకు తరుగనిదిగా గానవచ్చుచుండెను! ఇదంతయు ఎందునకువచ్చినది? ఒకతెవద్ద కూరగాయల గొనవచ్చినవాడొకడు రెండవ యామెవద్ద వాని గొనినందునకు!

జనులు గుంపులు గుంపులుగా గూడియుండిరి. సిగ్గుమాలిన ఈవ్యవహారమును, ఇట్టిభాషను వినువారిలో ఎందరో యౌవనులు, చదువుకొనినవారుగూడ నుండిరి! ఎంత మంచివినోదము!!

మహాలక్ష్మికూడ ఈవినోదము ననుభవించుచుండెను. అంతలో తొమ్మిదిగంటల ధ్వని వినవచ్చెను. దానిమనము నావరించిన సమ్మోహనాస్త్ర ప్రభావము వదలిపోయెను! గబగబపరుగెత్తి ఇల్లుచేరెను!

దాదిరాకచూచి, రుక్మిణమ్మముఖము పెంచుకొని యనెను "ఏమే, బజారులో దారి దప్పితివా?"

మహాలక్ష్మి అపరాధము నొప్పుకొను ముఖలక్షణ "దొరసానిగారు, నా కెరుకయున్న పనిమనిషియొకతె చాలదినములతరువాత దారిలో కనుపడినది. మాట్లాడుటలో కొంచెము ఆలస్యమైనది"

దొరసానికోపము మరింతహెచ్చెను. "య్యోరగారికి కచ్చేరీకి (ఆఫీసుకు) పోవువేళయగుచుండగా, ఈ సమయములో నీవు విహారము సల్పుచుంటివా?" యనెను. సమయమునుగ్రహించి, దాది మారుమాట పల్కక, అబ్బాయిని చంకనెత్తుకొనియె.

రుక్మి: (మొగమెఱ్ఱ జేసికొని విదిలింపులో) "అబ్బాయిని దింపండి, దొరసానిగారూ! వీగు వదలితే గుండె పగలదు లెండి!!"

యజమానురాలి ఈయాజ్ఞను నెఱవేర్చుట దాది కవసరముగా దోచలేదు. ఆమెకోపమును జల్లార్చుటకు ఆమెయాజ్ఞను నిరాకరింపుటయే ఉత్తమమగు ఉపాయమనితోచెను. అబ్బాయిని అట్లే చంకనుంచుకొని ద్వారముపైపు నడచుచుండెను. రుక్మిణమ్మ తొందరగాబోయి, పిల్లవానిని దాది చంకనుండి లాగికొని యనెను "నీనంగనాచితనము చాలకాలమునుండి చూచుచున్నానులే. నాకీచమత్కారములు చూపవలసినపనిలేదు. మఱెవరికైన చూపు కొల్లలు! కొల్లలు!!"

మహాలక్ష్మి అబ్బాయిని ప్రాణసమానముగా ప్రేమించుచుండెను. రుక్మిణమ్మకు ఈసంగతి తెలియుననియే దానితలంపు. రుక్మిణమ్మను, తనను బంధించుచుండిన ఏకపాశము ఏదైననున్నచో అది అబ్బాయియే అని యనుకొనెడిది. కఠినవాక్కులు ఈబంధమును సడలింపజాలకుండెను. తనను నౌకరీనుండి తొలగింతురని అది ఎప్పుడును అనుకొని యుండలేదు. కాని యిప్పుడు అబ్బాయిని బలవంతముగా చంకనుండి లాగుకొనినమీదట దానికి సహనము తొలగిపోయెను. "అమ్మగారూ, నావలన అంత గొప్ప తప్పిదమేదియు జరుగలేదు. మహాఅయితే పావుగంట ఆలస్యమై యుండవచ్చును. దీని కింత ఆగ్రహపడుచున్నారు! 'ఇంకొక యిల్లుచూచుకోవే' యని స్పష్టముగా చెప్పగూడదు? పుట్టించినవాడు పిడికెడుకూడు పెట్టడా? కూలినాలి దొరకని కరువుకాలము కాదుగదా! అమ్మా"

రుక్మి: "నీవు లేకపోతే మాకుమాత్రము పనిసాగదా ఏమి? నీవంటి పనికత్తెలు పైసాకు పదిమంది తిరుగుచున్నారు!"

మహా: "చల్లగా ఉండండి, అమ్మగారూ దాదులు పనికత్తెలు కావలసినంతమంది దొరుకుతారు. నాతప్పు మన్నించి సెలవిప్పించండి!"

రుక్మి: "మగవాండ్ల వద్దికిపోయి నీకు రావలసినజీతము లెక్కచూచుకో."

మహా: "నాకు రావలసిన పైకముతో అబ్బాయికి మిఠాయి కొని పెట్టండి."

ఇంతలో గోపాలరావు లోనికివచ్చి యడిగెను "ఏమి సమాచారము?"

మహా: "అయ్యా! ఏమియును లేదు. దొరసానిగారు సెలవిచ్చినారు. వెళ్లుచున్నాను."

ఉత్తకాళ్లతో నున్నవాడు ఎట్లుముండ్లను తప్పించుకొనుచు నడచుచుండునో, మనగోపాలరావుకూడ అల్లె గృహసంబంధమగు చిక్కులను తప్పించుకొనుచు, తొలగి తొలగి తిరుగుచుండువాడు. కనుక కొంచెము కోపదృష్టితో ప్రశ్నించెను

"అసలు ఏమిజరిగినది?"

రుక్మి: "ఏమియూ జరుగలేదు. నాయిష్టమువచ్చినది. ఉంచదలచుకొనలేదు; ఉంచనన్నాను. ఎల్లకాలము ఉంచుకొందునని కరారుచేసితినా?"

గోపా: "సుఖముగా కుడిచి కూర్చుండలేక ఏదో యొక చిక్కు తెచ్చిపెట్టుకొనుచుందువు."

రుక్మి: "ఏమిచేయను? నాకిట్టి వెఱ్ఱియున్నది. స్వభావమే యట్టిది. మీకు మహాలక్ష్మి ఇష్టమైనది కనుక మెడకు కట్టుకొనండి. ఇంటిలో దానియవసరము లేదు!"

ఇల్లువదలిపోవునపుడు దాదికన్నులు బాష్పపూరితములై యుండెను. అబ్బాయిని-కృష్ణమూర్తిని—ఒకసారి ఎత్తుకొని ముద్దుపెట్టుకొని మరిపోవలయునని హృదయము కొట్టుకొనుచుండెను. కాని ధైర్యముకలుగలేదు. నిరాశాభరితమగు మానసముతో మహాలక్ష్మికాలిడాడెను!

తేది 18-10-1986

కృష్ణమూర్తి దాది వెంటవెంట ద్వారముదాక వచ్చెను. కాని మహాలక్ష్మి తలుపు బయటినుండిమూసెను. అమాయకుడగు బాలకుడు "మాచీ, మాచీ"అని యేడ్చుచు క్రిందబడి పొరలాడసాగెను. రుక్మిణమ్మ అదమాయించెను; బుజ్జగించెను; ఎత్తుకొన యత్నించెను; మిఠాయి తెప్పించిపెట్టెదనని యాసగొలిపెను. బజారుకు తీసికొని పోయి బొమ్మలమూటెడనని వాగ్దానమొనర్చెను. ఈపద్ధతులలో నేదియు అక్కరకురాకపోగా, కోతిపేరు బూచిపేరుచెప్పి భయపెట్టెను. అన్నియు వ్యర్థములయ్యెను. తుదకు రుక్మిణమ్మకు కోపమువచ్చి, పిల్లవాని నేల చదికిలబడవేసి, గృహకృత్యములవైపు మరలెను. కృష్ణమూర్తిముఖము, చెక్కులు ఎఱ్ఱబారెను కనురెప్పలుబ్బెను. ఏడ్చిఏడ్చి అల్లటయలసి, పరుండి నిద్రపోయెను.

'కొంచెముసేపు ఏడ్చి వాడే యూరకుండును' అని రుక్మిణమ్మయనుకొనెను. కాని అబ్బాయి నిద్రలేవగానే మరల "మాచీ," "మాచీ"యని దాదిపేరు జెప్పుచు ఏడ్వసాగెను. సాయంత్రమువేళ గోపాలరావు కచ్చేరీనుండివచ్చి, బాలునిస్థితిచూచి, విచారపడి భార్యను కోపదృష్టితో నవలోకించెను. పిల్లవానినెత్తుకొని యోదార్చుచుండెను. "మాచి" తనకొరకు మిఠాయితెచ్చుటకై బజారునకుబోయినదని నమ్మకము కుదిరినతరువాత, కృష్ణమూర్తి సమాధానపడి యూరకుండెను.

చీకటిపడగానే యాశిశువు మరల ఏడ్వసాగెను "మాచి, మిఠాయితెచ్చిందా?"యని. రెండుమూడుదినము లీప్రకారము గడచెను. "మాచి" "మాచి"యని. యేడ్చుట అల్లరిపెట్టుటతప్ప కృష్ణమూర్తికి వేరపనిలేదు. నిముసమైనను వానిచంక బాయకుండిన యానోరులేనికుక్క, గూటిలో నెల్లప్పుడు గూర్చుండి కుంయి, కంయిమనక వానినెప్పుడు సంతోషపెట్టుచుండినపిల్లి, వానికి కడు ప్రేమాస్పదమైన యారంగురజాలని చిలుక,—ఇవియన్నియు తమప్రాముఖ్యమును గోల్పోయెను. బాలుడు వీనినికన్నెత్తియైన చూడడు. తనమీద అపేక్షపడునదియు, ఎత్తుకొని త్రిప్పునదియు, జోకొట్టి నిద్రపుచ్చునదియు, పాటలుపాడి నవ్వించునదియు,— నగుసజీవయగు దాదిస్థానమును పైవస్తువులలో నొక్కటియు అక్రమింప

నేరదయ్యెను. నిద్రలో బాలుడప్పుడప్పుడు కలువరించి "మాచీ, మాచీ"యని యరచుచు మేల్కొని యేడ్వ మొదలిడును. ఒక్కొకప్పుడు ద్వారమువద్దకి బోయి "మాచి"ని బిగ్గరగా పిలుచుచుండును. రమ్మని చేతులతో సంజ్ఞ చేయుచుండును. దాదియుండు గదిలోనికిబోయి యచ్చట గంటలకొలది కూర్చుండును. 'మాచి' యచ్చటికివచ్చునని వానినమ్మకము! ఆగది తలుపు వేసి యుండినచో పోయి తట్టుచుండును! లోపల నదె దాగియున్నదేమో యని వానియూహ. సింహద్వారము తెరచినచప్పుడు వినరాగానే "మాచి" వచ్చినదేమో యనుకొని పరుగెత్తిపోవును. బంతివంటి యాశరీరము కృశింపసాగెను. గులాబిపూలవంటి చెక్కులు ఎండిపోయినట్లు కాన్పింపదొడగెను. తల్లిదండ్రులిరువురు వాని మందహాసమునకై పరితపించుచుండిరి. చక్కిలిగింతపెట్టి బలవంతముగ నవ్వించినచో, ఆనవ్వు నిముసమునకంటె నిలిచియుండెడికాదు. పాలమీద వానికి ప్రేమతగ్గెను. పటికబెల్లముమీద అంతకంటెను. పండ్లుగాని, బిస్కట్టులు గాని వానికి రుచిగా నుండలేదు. "మాచి" పెట్టుచుండినప్పుడు వానికీవస్తువులు మహారుచిగలవిగా దోచుచుండెను. ముద్దులు మూట గట్టుచున్న రెండుసంవత్సరములు దాటిన కృష్ణమూర్తి—నవనవలాడుచుండిన యాకోమల పుష్పముక్క—వాడిపోవచ్చెను. సందిట నెత్తికొనగనే ఆనందము గొల్పుచుండిన బాలుడు నేడు శల్యముల గూడుగా మారెను. రుక్మిణమ్మ బాలుని ఈస్థితిమాచి లోలోన చింతించుచు తన తెలివితక్కువతనమును నిందించుకొనుచుండెను. తనపనియేమో చూచుకొనుచు దివానఖానా (చావిడి)లో కూరుచుండు—ఏకాంతవాస స్వభావముగల—గోపాలరావు ఇప్పుడు అబ్బాయిని చంకనుండి దింపజాలక పోయెను. ప్రతిదినము వానిని విహారమునకై తీసికొనిపోవుచుండెను. దినదినము క్రొత్త క్రొత్త హల్వాలు పెట్టించుచుండెను, కాని యామొక్క వాడిపోవుచునేయుండెను. దాది యామొక్కకు సూర్యకాంతి. అట్టి నైసర్గికసాధనమును గోలుపోయి మొక్క ఎట్లు నవనవలాడగలదు? మహాలక్ష్మి ఇంటినుండిపోయిన మూడవ నాడే మరియొక పనికత్తెనుంచిరి. కాని కృష్ణమూర్తి దానిని 'దయ్యము'ను జూచినట్లు భావించి, దగ్గరకు బోక వెనుదీసెను!

బాహ్య ప్రపంచమున "మాచి" కనబడకుండినను, కృష్ణమూర్తి, మానసిక ప్రపంచమున—ఊహాలోకమున—తరచుగా దానిని జూచుచుండును. అచ్చట నది తిరుగుచుండెను. అదే పూర్వపు ఆకారము: అవే ముద్దుమాటలు. అవే మనోహరములగుపాటలు; అవే తియ్యని మిఠాయీలు: అవే రాత్రిందివములు!! ఒంటరిగా గూర్చుండి "మాచి"తో సంభాషించుచుండును. "మాచీ, చూడు నాకుక్క ఎట్లా అరుస్తుందో," "మాచీ, ఆవుపాలపిండుతా" "మాచీ, గుర్రము ఎక్కి పోతా" మున్నగువాక్యములు పల్కుచుండెను. తెల్లవారగానే చెంబుతీసికొని దాదియుండిన గదిలోనికిపోయి, "మాచీ,మంచినీళ్లుతాగు" అనును! పాలగ్లాసు తీసికొనిపోయి గదిలో పెట్టి "మాచీ, పాలుతాగు" అని పల్కును!! మంచముమీద దిండుపెట్టి దానిపైన గుప్పటికప్పి, "మాచి, నిద్రపోతున్నది." అని వచించును!! రుక్మిణమ్మ అన్నము తినుచుండినపుడు పళ్లెములు తీసికొనిపోయి దాదిగదిలో పెట్టి "మాచి అన్నము తింటున్నది" అని చెప్పును!!! "మాచి" ఇక కనుపడదని బాలునకుదోచెను. దాదిస్మరణమాత్రమువానికి సంతోషదాయకమైయుండెను. శిశువునందిప్పుడు బాల్యమునకు సహజములగు [illegible]తనము, పాటముపోయి, ఆస్థానమును సాధుత్వము, నిరాశయనునవి యాక్రమించెను. రెండువారము లిట్లు గడచెను. అది వర్షకాలము. ఊరిలో జ్వరములు, దగ్గుపడిసెములు ఉండెను. కృష్ణమూర్తి ఋతువు మార్పును సహింపజాలడయ్యె. రుక్మిణమ్మ శిశువువిషయమై ఎంతో జాగ్రత్త పుచ్చుకొనుచునే యుండెను. ఫ్లానలుకుడతా తొడుగుచుండెను. నీటివద్దకు పోనీయదు. ఉత్తకాళ్లతో నొక్కయడుగైన పెట్టనీయదు! అయిననేమి? జలుబుచేయనే చేసెను. జ్వరము, దగ్గు పడిసెము రానేవచ్చెను.!!

౪

ప్రొద్దుటిపూట. శిశువు మంచముపైన కన్నులు మూసి పరుండెను. రుక్మిణమ్మ మంచముమీద గూర్చుండి బాలునియొడలి కేదో తైలము రాయుచుండెను. గోపాలరావు చింతాప్రదర్శకములగు చూడ్కుల కుమారునిపై బరపుచు ప్రక్కనె చదికిలబడియుండెను. అతి దీనదుమ

భార్యతో నీవిషయమున మాట్లాడుట చాలవరకు మానుకొనెను. రుక్మిణమ్మపైన నతనికి అసహ్యము కలుగజొచ్చెను. కొడుకునకువచ్చినవ్యాధికి మూలకారణము తల్లియని యాతడు నిశ్చయించి, నేరము నామెపైననే మోపెను. గోపాలరావుదృష్టి కామె ఉత్తరసురాలు; అల్పబుద్ధిగలది; కోమలభావశూన్య!"

రుక్మి: (జంకుతో) "ఇవాళ్ల పెద్దడాక్టరుగారిని తీసికొని వస్తారా? ఆయనవైద్యమువలన మనము గట్టెక్కగలమేమో?"

గోపా: (ఆకాశము నావరించియున్న నల్లనిమేఘముల వైపుజూచి) "పెద్దడాక్టరుకాదుగదా ధన్వంతరివచ్చినను ఉపయోగము లేదు."

రుక్మి: "అట్లైతే, ఇక ప్రపంచములో ఈవ్యాధికి మందే లేదా?"

గోపా: "ఒకటేమందు; కాని అదిదొరకునదికాదు."

రుక్మి: "మీరెప్పుడు అర్థముతప్ప మరొకమాటయే లేదు. మహాలక్ష్మి సంజీవిదెచ్చునా? అమృతభాండముతీసికొని వచ్చునా?"

గోపా: "అది నీమనస్సునకు విషభాండమే యగుగాక, అబ్బాయి విషయమున నది అమృతభాండమే!"

రుక్మి: "ఈశ్వరుని చిత్తమునందు—ఈశ్వర వ్యవహారమునందు మహాలక్ష్మికి అంత ప్రవేశమున్నదేమో!—నేనెరుగను."

గోపా: "ఎరుగని పక్షమున—ఇంకను తెలిసికొనని పక్షమున—ముందు ఏడ్చెదవు! కడుపున చిచ్చుపెట్టుకొందువు!!"

రుక్మి: "ఛీ ఊరుకోండి, ఇటువంటి అశుభము నోటరానీయవలదు. 'శుభము పలుకరా—అంటే ఏమో' యన్నట్లు—అనరానికి పోండి."

గోపా: నేనుపోతాను. కాని ఈవిషయమున నింద నీపైననే యుండునని నమ్ము. కృష్ణుడు ఆరోగ్యమును మరల కాంచవలయునని నీకిష్టమున్న పక్షమున—మహాలక్ష్మివద్దకు పో. దానిని బ్రతిమాలుకో; వేడుకో నీకొడుకు ప్రాణములు దానిచేతిలోనే యున్నవి!

రుక్మిణమ్మనోరు ప్రత్యుత్తర మియ్యలేదు. కన్నులుమాత్రము బాష్పములతో జవాబుచెప్పెను.

గోపా: "ఏమనెదవు. పోయిదానిని వెదకివత్తునా?"

రుక్మి: "మీరెందుకుపోతారు? నేనే పోయెదను."

గోపా: "అంతమాత్రము దయ చేయుము; నాకు నీమీద నమ్మకము లేదు. నీనోటినుండి ఏదైన రాగూడనిమాట వచ్చినయెడల అదివచ్చుటకు సిద్ధముగా నుండినను రాకపోవునేమో?"

రుక్మిణమ్మ ఈయెత్తిపొడుపునకు ప్రత్యుత్తరముగా నొకతీవ్రదృష్టి భర్తపై ప్రసరింపజేసి యనెను. "నిజమే. అబ్బాయి జబ్బుపడినందునకు నాకేమైన విచారమున్నది కనుకనా?—సిగ్గుచేత మీతోననలేదు కాని నాకెన్నిసారులు తోచినది. దానియిల్లు జాడ నాకు తెలిసియుండిన యెడల నేనెన్నియో దినములక్రిందనే దాని బతిమాలితీసికొని వచ్చియుందును. నామీద కోపముండినను, దానికి అబ్బాయి అంటే ప్రాణము. ఈదినము పోయివచ్చెదను. దానిచేతులుకాదు— కాళ్లుపట్టుకొనెదను. పుత్రభిక్షము పెట్టుమని యేడ్చెదను! ఏమిచేసినను దాని బిలుచుకొని వచ్చెదను!

ఈమాటలు పలుకునపుడు రుక్మిణమ్మ కంఠము గద్గదమాయెను. ఎంతోకష్టమున శబ్దములు పెదవులనుండి వెడలెను. గోపాలరావు భార్యదీనావస్థను సహానుభూతితో జూచి యనెను "నీవుపోవుట బాగుండదు. నేనే పోయివచ్చెదను."

౫

మహాలక్ష్మి, పాపము, ఈప్రపంచమున ఏకాకి. ఒకప్పుడు దానికుటుంబము గులాబిచెట్టువలె నవనవలాడుచుండెను. కాని కాలక్రమమున శిశిరఋతువు ఆకుల రాల్చివైచెను. ప్రతికూలవాతాహతి చెట్టును నాశనము చేసెను. ఇప్పుడానేత్రోత్సవకరమగు చెట్టునకు స్మారక చిహ్నము ఈమిగిలినకొమ్మ—ఈమహాలక్ష్మి— మాత్రమే.

కృష్ణమూర్తి నాడింటనుద్యోగము దొరకిననాటి నుండియు, ఎండిపోయిన తుదికొమ్మకు ప్రాణమువచ్చెను. ఇది చిన్నచిన్న క్రొత్తయాకుల దొడగెను. నిస్సారమైన జీవితమున నొకింత క్రొత్తవికాసము కలిగెను! [illegible]

యందు అరణ్యమున దారితప్పి తిరుగుచుండిన బాటసారికి సన్నని దీపకాంతి పొడచూపెను! రాలురప్పలలో బడి కొట్టుకొనుచుండిన దాని ప్రాణము లిప్పుడు పువ్వు భరితమగు నారామమున సంచరించుచుండెను !! దానిజీవితము ఇప్పుడు నిరర్థకముకాక సార్థకముగా బొడకట్టియుండెను !!!

కృష్ణుని అమాయికపు మాటలు, మనోహరములగు వానిచేష్టలు, మహాలక్ష్మి హృదయమును వశముచేసికొనెను. కాని మనస్సులోని ప్రేమ నది దాచియుంచుకొనును. తల్లికి తెలిసిన ఆమె యసూయపడునేమోయని మహాలక్ష్మిభయము. చాటుగా మిఠాయితెచ్చి బాలునికి బెట్టి యానందించును. కృష్ణునకు దృష్టితగులకుండ తాయెతులను రక్షరేకులను తెచ్చికట్టును. ఇతరులుచూడగా వానికేతినువస్తువును పెట్టదు. 'అబ్బాయి ఏమియు తినడే తిన' డని యందరకు చాటును. వేయేల? మహాలక్ష్మిది స్వచ్ఛమైన మాతృప్రేమ! దానిలో ఆత్మానందముతప్ప స్వార్థము లేశమైనను లేదు !!

గోపాలరావుగారి యిల్లువదలిననాడు నాటకశాలయందొక్కమారు అన్నిదీపము లారిపోయినప్పుడుం డుస్థితి మహాలక్ష్మి మనస్సున నుద్భవించెను. కన్నుల యెదుట అదియే ప్రదర్శనము; అదియే ఆట! చెవులలో అవే పాటలు !!

ఆనాడు దాని కేమియు తోచలేదు. రాత్రి ఎట్లోగడిపెను. ఉదయమున ఇల్లూడ్చుకొనుచుండగా, మిఠాయీ అమ్మువానికేక వినవచ్చెను. వెంటనే చీపురుకట్ట పడవైచి హల్వాకొనబోయెను. "నేడు హల్వా ఎవరికి కొనిపెట్టవలెను? నాయొడిలోగూర్చుండి ముద్దులుగులుకు ముచ్చటలు నేడెవ్వరాడుదురు? హల్వా తినునప్పుడు కృష్ణునికన్నులందును, పెదవులందును, శరీరముయొక్క ప్రతియవయవమునందును ప్రకటమగుచుండు ఆనందరసము ఈనాడు నాకెక్కడినుండిలభించును"అను భావములు తలంపునకురాగా మహాలక్ష్మి హృదయము వ్రయ్యలుకాజొచ్చెను ! అట్టిస్థితిలో "అబ్బాయిని చూచివత్తాము" అనుకొని యది చిత్తవిభ్రాంతితో నిల్లు వదలెను. సగముదూరముపోయి మరలివచ్చెను.

కృష్ణుడు ఒక నిముసమైనను మహాలక్ష్మి హృదయమును వదలియుండలేదు. నిద్రలో దానికి బాలుడేడ్చుచుండినట్లు వినవచ్చి యదరిపడిలేచును. ఒక్కొకమారు కూర్చుండినప్పుడు, కృష్ణుడు కర్రగుర్రము నెక్కిపోవుచున్నట్లు తోచి పక్కునవవ్వును. ఇరుగుపొరుగువారిండ్లకుపోయి వాని చిలిపిచేష్టలు వర్ణించుచుండును. ఆబాలునిపైగల ప్రేమ మహాలక్ష్మి హృదయస్థలమునంతను ఆక్రమించియుండెను. రుక్మిణమ్మ చూపిన నిరాదరణను గురించిన వ్యాకులమునకు అచ్చట నిక స్థలమేది?

మహాలక్ష్మి ప్రతిదినము, "కృష్ణుని ఈరోజు చూచెదను" "ఈరోజు చూచివచ్చెదను" అని సంకల్పించుకొనుచుండెను. ప్రతిదినము బజారునకుబోయి ఏవో ఆటవస్తువులనో, మిఠాయియో కొని తెచ్చుచుండెను. కాని సగముదూరముపోయి మరలివచ్చుచుండును. కొన్నివేళల నాలుగు అడుగులుపోయి తిరుగును. "ఏమిమొగము పెట్టుకొనిపోదును?" అని యొకమారనుకొనును. "కృష్ణుడు అసలు నన్ను గుర్తుపట్టునా? పట్టకపోతే ఏమి చేయుదును? పిల్లవాండ్ర అపేక్ష నమ్మికమేమి? క్రొత్త దాదికలవారైయుండవచ్చును. ఇట్టిభావములు గొలుసులై దాని కాళ్లగట్టవైచుచుండెను!

ఈప్రకారము మూడువారములు గడచెను. దూరప్రయాణము చేయుచున్న బాటసారిహృదయమువలె మహాలక్ష్మి మనస్సెప్పుడును నిరుత్సాహపడియుండును. ఇంటిలోని వస్తువులెక్కడివక్కడనే పడియుండును! అన్నముమీదగాని బట్టమీదగాని ఆసక్తియుండదు! ఆ దినములలో ఇరుగుపొరుగువారు కొందరు కాశీకిబోవు యత్నమునందుండిరి. పంజరమునుండి బయటబడిన పక్షి ఏదైన నొకమూల నాశ్రయము వెదకుకొనునట్లు, మహాలక్ష్మి మానసము విశ్రాంతికై అటునిటు పరువులుపెట్టుచుండెను. అట్టిసమయములో కాశీయాత్రమాట దాని మనస్సునకు వచ్చెను. ప్రయాణయత్నములు చేసికొనెను.

హైదరాబాదు రైలుస్టేషనునందు యాత్రికులనేకులు గుంపులుగుంపులుగా గూడియుండిరి. కొందరు రైలు డబ్బాలలో గూర్చుండియుండిరి. కొందరు తమవారి సెలవు లందికొనుచుండిరి. ఎటుచూచినను సందడిగానుండెను. పరమార్థము చూరగొనుటకై యాత్రకు బోవుచున్నవారిని

ఈ సమయమున గూడ ప్రపంచము పట్టిలాగుచునే యుండెను! ‘వరికోత కైనతరువాత చెరువులోపల కర్బూజాపంట పండించవలసినది సుమా” యని కుమారుల హెచ్చరించు తండ్రులును, “రైతులవద్దినుండి పైకము వసూలు కానిచో దావాచేయక మరచెదవు సుమా” యని తమ్ములకు బోధించు అన్నలును, “అప్పు లిచ్చి వారివద్ద నూటికి నెలకు రెండురూపాయలకంటె తక్కున వడ్డికి పుచ్చుకోవలదు”ని పిన్నలకు చెప్పు పెద్దలును, “పరకులు సమయమునకు అందనియెడల నీవు స్వయముగా పోయిరావలసినది”ని ఖండితముగా గుమాస్తాలకు చెప్పు యజమానులును ఎందరో యుండిరి! కొందరు మాత్రము ధ్యాననిమగ్నులును, కేల జపమాలలను త్రిప్పుచుండిన వారును కానవచ్చుచుండిరి.

నాన మహాలక్ష్మి యొక డబ్బాలో గూర్చుచుండి యనుకొనుచుండెను: “ఈ పెద్దమనుష్యులను ఈ సమయమున గూడ ప్రపంచవ్యామోహము వదలిపెట్టక పోయెనే. ఇప్పుడు కృష్ణుడు ఇక్కడ నుండెనా, ఎంత ఏడ్చునో ఎంతగోలపెట్టునో! నా యొడిలోనుండి అసలు దిగియే యుండడు. కాశీనుండి వచ్చిన తరువాత పోయి చూచివస్తాను: రైలు ఇంకా ఎందుకు సాగదు? ఉడుకపోసిపోసి ప్రాణముపోవున ట్లున్నదే!”

అంతలో గోపాలరావు పైసికలు చేతబట్టుకొని ప్లాటుఫారముపైన ఎవరినో వెదకుచుండినట్టు కాన్పించెను. అతని ముఖము వెలవెల పోవుచుండెను: ఆయనను చూడగానే మహాలక్ష్మి బండిలోనుండి తల యీవలకు బెట్టెను. గోపాలరావు అది కనుపడగానే ముందునకుసాగి ప్రశ్నించెను: “ఏమిమహాలక్ష్మి! నీవుకూడయాత్రపోవుచున్నావా?”

మహా:—“అవునండి, అయ్యా, ఇక్కడ చేయదగిన పనియేమున్నది? జీవనము లేదు. ఈ పాడుశరీరము ఎన్నడు పడిపోవునో. దేవునకు ముఖము చూపు ఆస్కారము ఉండవలెనుకదా! అయ్యా, అబ్బాయి గారు బాగున్నారా?”

గోపా:—“నీవు యాత్రకు పోవుచునే యున్నావు. అబ్బాయి సంగతి విచారించి మాత్రము ఏమిచేయగలవు?—వాని క్షేమమునకై కాశీ విశ్వనాథుని ప్రార్థింపుచుండుము.”

మహాలక్ష్మి గుండెలుకొట్టుకొనసాగెను. “అయ్యా, అబ్బాయిగారి శరీరము బాగులేదా?” అని యడిగెను.

గోపా:—“నీవు మాయిల్లువదలిన నాటినుండి అబ్బాయి ఆరోగ్యము చెడినది. రెండువారముల వరకు “మాచీ, మాచీ” యని రాత్రిం దివములు నిన్ను స్మరించుచు, మారాము పెట్టినాడు. ఇప్పుడు వారము దినములైనది. జ్వరము దగ్గు పడిసెము వదలటము లేదు. మందు మాకులవలన ఉపయోగము కనుపడ లేదు. నిన్ను చూస్తే ఆరోగ్యము కుదురునేమో యనుకొని, బ్రతిమాలి తీసికొని పోదామని మీ యింటికి వెళ్లి విచారించితిని. నీవు కాశీయాత్రకు బోవుచున్న వార్త తెలిసి వచ్చినాను. నిన్ను రమ్మనుమను బుద్ధి యున్నది. కాని నీ విషయములో మేము చూపిన ఆదరణ ఏ మంత బాగుగా నుండినది? నిన్ను పిలుచుటకు ధైర్యము తోచుట లేదు. అంతేకాక, కాశీ పోనివాండ్రను పంపుట పుణ్యముగాని పోవుదానిని ఆపుట మెచ్చదగిన పని కాదుకదా. ఆయువు మిగిలి యున్నయెడల బ్రతుకగలడు.!”

మహాలక్ష్మి కన్నులు చీకట్లు గ్రమ్మెను. ఎదుటనున్న వస్తువులు నీటిమీద తేలియాడుచున్నట్లుండెను. విచిత్రమగు భయభ్రాంతి తోపసాగెను. “ఈశ్వరా! కాశీ విశ్వనాథా! నా కృష్ణుని ప్రాణము కాపాడుము ‘తుచ్ఛ’మైన నగు నా ప్రాణములు నీ కర్పించుచున్నాను!!” అను ప్రార్థనావచనములు అప్రయత్నముగా మహాలక్ష్మినోట వెడలెను. కన్నుల బాష్పములు గారసాగెను. కంఠము చెడెను. “నేనెంత కఠినురాలను. పాపము కృష్ణుడు ఏడ్చిఏడ్చి వ్యాధిగ్రస్తు డయ్యెనేమో. నేను చూచియైన రాకపోయితిని. రుక్మిణమ్మ దుస్స్వభావము కలదియే యనుకొంటిని. నోటివట్టముదే యనుకొంటిని. అయినను అబ్బాయి నాకేమి యపకారము చేసెను. తల్లి యపరాధమునకు నేను కొడుకును—అమాయకు డగు శిశువును—శిక్షించితిని! రామచంద్రప్రభో! నా తప్పు మన్నింపుము!! అపరాధిని, మహాపాపిని!!” యను భావములు మెదడునందు పరువిడసాగెను. “అక్కటా! అబ్బాయికి నామీద ఇంత యపేక్షయున్న సంగతి నే నెరుగకపోయితిని! తెలిసి

యింటినుండి గెంటివేసినను అక్కడనే పడియుందును. పాపము, ఎట్టి స్థితియం దున్నాడో కదా” యని తలపోసి భయకంపితమగు ధ్వనితో నడిగెను :

“ అయ్యా, పాలు త్రాగుచున్నాడు కాదు ?”

గోపా: “పాలమాట యడుగుచున్నావా ? రెండు దినములనుండి కన్నులే తెరవడు. ”

మహా:—అయ్యో, నాయనా ! ఓరీ మాలీ, ఈ సామాను కొంచెము దింపు, మాయయ్య, మంచివాడవు. ఇక నాకు కాశీ గయలు తోచవు. త్వరగా దింపు. (గోపాలరావుతో) అయ్యగారూ, జట్కాబండి ఉన్న దేమో చూచి కుదిరించండి. నాకాళ్లు వడకుచున్నవి !”

మహాలక్ష్మి జట్కాబండిలో గూర్చుండెను దారిలో బండ్లు అడ్డముగా నిలిచియుండెను. జట్కాగుర్రము మందముగా నడువసాగెను. ప్రయాణికులు కొందరు గుంపులు గుంపులుగా మార్గమున మూగియుండిరి. మహాలక్ష్మి కీయాటంకములు కోపము, విసుకు తెప్పించుచుండెను. గుర్రమునకు రెక్కలు వచ్చినచో సంతసించియుండెడిదేమో. గోపాలరావుగారి యింటి సంగు సమీపించెను: “ దేవుడా క్షేమముగా నుంచుము ” అను మాటలు మాటిమాటికి నోట వెడలుచుండెను !

బండి సందులోనికి ప్రవేశింపగానే ఏదో రోదన ధ్వని వినవచ్చెను. గుండెలు పగులసాగెను. తల తిరుగ దొడగెను. సముద్రమున బడి మునిగిపోవుచున్నట్టు దోచెను. జట్కాలోనుండి క్రిందికి దుముకదలచెను. అంతలో ఆధ్వని అత్తవారింటికి బోవుచున్న యొక క్రొత్తకోడలి దని తెలిసి ప్రాణములు కుదుటబడెను!

ఇల్లు ప్రవేశించిరి. మహాలక్ష్మి భయముతో ద్వారమువైపు చూచెను. అంతయు నిశ్శబ్దముగా నుండెను. వంటవాడు కూర్చుండియుండెను. మహాలక్ష్మి ధైర్యముతో లోనికి బోయెను. క్రొత్తదాది ఏదో మందు సిద్ధము చేయుచుండెను. రుక్మిణమ్మ తనగదిలో పిల్లవాని నొడిలో గూర్చుండబెట్టుకొని, తలుపువైపు దృష్టి నిగుడించి—దుఃఖము: నిరాశ—ఈరెండును కలిసి యేర్పడు మోముతో—ఉండెను.

మహాలక్ష్మి రుక్మిణమ్మ యొడినుండి కృష్ణు నెత్తుకొని, నీరు నిండియున్న కన్నులతో ననెను: “ నాయనా, కృష్ణమూర్తీ, కన్నులు తెరువు. ”

బాలుడు కన్నులు తెరిచి, రెండునిముసములవరకు నిశ్శబ్దముగా తన్నెత్తుకున్న మనిషి ముఖము తేరిపార జూచుచుండెను. తరువాత వెంటనే దాని మెడను కౌగిలించుకొని యనెను: “ మాచి వచ్చింది! మాచి వచ్చింది!!”

కృష్ణుని పచ్చబారిన మోమున కాంతి హెచ్చెను. ఆరిపోనున్న దీపమునకు తైలము దొరికెను. ఇక కావలసిన దేమి ?

ఆశాభంగము

దువ్వూరి సాంబమూర్తి గారు

పసిడిగిన్నియం బోసిన ప్రణయమధువు
గాంచి యెంతో మురిసితినిగాని గ్రుక్క
డైన త్రావంగ లేనైతి అక్కటకట
అంత పెదవులకందియు నందరాని
నాదుచక్కనిమధుపాత్ర నాయెదుటనె
పెరికి నేలకు గిరవాటు వైచినారు

నాటి మొదలు హృదయమున నాటుకొనిన
చింతచే బ్రతుకెంతయు చివికిపోయె
తొడిమి తెగిపోవగా జారి పుడమిబడిన
పూవుచందమునో లేక తీవలన్ని
విరుగగా నేలపడియున్న వీణవలెనో
ఇంపుచెడి యొంటిగా చీకటింటిలోన
తిరుగులాడుచుంటిని ప్రభూ! దిక్కుమాలి.